COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: విజయవాడ,

తేది : **10.03.2016**

# అంకెల గారడీ – రాష్ట్ర బడ్జెట్

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీతో ప్రజల్ని మోసపుచ్చేదిగా వుంది. ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి ప్రభుత్వం తన పాత్రను తగ్గించుకొని ప్రైవేటు వ్యవస్థలకు రాయితీలు కట్టబెట్టే పద్ధతి ఈ బడ్జెట్‌లో కనబడుతుంది. వనరుల సమీకరణ కోసం పిపిపి (ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) పద్ధతిని అనుసరించే పేరుతో పెద్దఎత్తున ప్రభుత్వ వనరులను ప్రైవేటువారికి కట్టబెట్టి ప్రజలపై భారాలు వేయడానికి ప్రభుత్వం ద్వారాలు తెరిచారు. ఇది దుర్మార్గం. ప్రభుత్వం పునరాలోచించి కీలకమైన రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుతూ సవరణలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) డిమాండ్ చేస్తుంది.

**రాష్ట్రాన్ని 2029 నాటికి దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తయారు చేస్తామని ఆర్థికమంత్రి బడ్జెట్ ఉపన్యాసంలో చెప్పినదానికి భిన్నంగా బడ్జెట్ కేటాయింపులున్నాయి. అంకెల్లో అభివృద్ధి, ఆచరణలో తిరోగమణం దిశలో రాష్ట్ర బడ్జెట్ వుంది. వాస్తవానికి రూ.20వేల కోట్లు గతేడాదికంటే బడ్జెట్ పెరిగినా కీలకమైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల వంటి రంగాలకు కోత విధించారు. బడ్జెట్ రాబడిలో పన్నులద్వారా అధనంగా రూ.7,895కోట్లు వస్తుందని లెక్కలు చూపించారు. అంటే పన్నులు పెంచకపోయినప్పటికీ వివిధ పద్ధతుల్లో ప్రజలమీద భారాలు వేయబోతున్నారన్నది సత్యం.**

వ్యవసాయ ప్రాధాన్యతా బడ్జెట్‌గా చెప్పినా గతేడాది వ్యవసాయ అనుబంధ రంగాలకు 6.82శాతంగా కేటాయిస్తే ఇప్పుడు 6.25శాతం మాత్రమే కేటాయించారు. గ్రామీణాభివృద్ధికి 15.99శాతం నుండి 11శాతానికి కుదించారు. ఇరిగేషన్ రంగానికి 7.92శాతం నుండి 5.88శాతానికి కోత విధించారు. విద్యుత్ రంగానికి 4.29శాతం నుండి 2.94శాతానికి కోత విధించారు. వాస్తవానికి బడ్జెట్ రూ.20వేలకోట్ల వరకు పెరిగితే ఆ మేరకు కీలకమైన రంగాలు తీవ్ర అన్యాయానికి గురయ్యాయి.

డ్వాక్రా మహిళలకు రుణాలు, నిరుద్యోగులకు భృతివంటి అంశాల ఊసే ఈ బడ్జెట్‌లో కనిపించలేదు. రానున్న 7ఏళ్ళలో పేదలకు 40లక్షల గృహాలు నిర్మించడం లక్ష్యంగా ప్రకటించి బడ్జెట్‌లో మాత్రం రూ.1,132కోట్లు కేటాయించడం దుర్మార్గం.

విద్యుత్ సబ్సిడీకి గతేడాది రూ.4,252కోట్లు కేటాయించి ఇప్పుడు దాన్ని రూ.3,702కోట్లు రూ.550కోట్లు కోత విధించారు. ఒకవైపు విద్యుత్ సంస్థలు విద్యుత్ ఛార్జీలు పెంచుతామని ప్రకటించగా ప్రభుత్వం సబ్సిడీలు తగ్గించడమంటే ప్రజలపై మరిన్ని విద్యుత్ భారాలు మోపడానికి ప్రభుత్వం కుట్రపన్నింది.

రుణమాఫీకి అవసరమైన నిధులను కోత విధించింది. కౌలురైతులందరికీ రుణాలు రద్దుచేస్తామని చెప్పి దానికవసరమైన కేటాయింపులు నిధులు మాత్రం బడ్జెట్‌లో చేయలేదు. చంద్రబాబు పాలనలో ఆత్మహత్యలు చేసుకున్న సుమారు 350 మంది రైతులకు ఎక్స్‌గ్రేషియో గురించిగానీ, రైతుల ఆత్మహత్యల గురించిగానీ కనీస ప్రస్తావన చేయకపోవడం దుర్మార్గం. ఈ ఏడాది 359 కరువు మండలాలలో చెల్లించాల్సిన సబ్సిడీలు, నష్టపరిహారాలు బడ్జెట్ పట్టించుకోలేదు.

2016 జూన్ నాటికి తోటపల్లి, పోలవరం కుడికాలువ, గాలేరు-నగరీ, హంద్రీ-నీవా పూర్తిచేస్తామని గవర్నర్ ప్రసంగంలో చెప్పిన ప్రభుత్వం నిధులు మాత్రం కేటాయించలేదు. ఇరిగేషన్‌కి కేటాయించిన నిధులతో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడానికి దశాబ్దాల కాలం పడుతుంది. గతేడాది ఇరిగేషన్ బడ్జెట్‌కు రూ.8,860 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.7,935 కోట్లకు తగ్గించారు. రూ.925 కోట్లు కోత విధించారు. ఇరిగేషన్‌కి బడ్జెట్‌లో నిధులు కోత విధిస్తూ త్రాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేస్తామని చెప్పడం విడ్డూరంగా వుంది.

బిసిలకు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నానని చెప్పుకుంటున్న ప్రభుత్వం బిసిలకు బడ్జెట్‌లో కేవలం 6.5శాతం నిధులను మాత్రమే కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కి నిధులు పెరిగినట్లు కనిపిస్తున్నా జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయించలేదు.

40వేలమంది కార్మికులకు ఉపాధి కల్పించే మూతపడ్డ పరిశ్రమలు తెరవడం గురించిగానీ, వేలాదిమందిగా వున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజ్‌చేసి కనీస వేతనాల గ్యారెంటీ చేయడానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదు.

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి